


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

''ఏం లేదు. చెప్పు.''

''ఆ డ్రైవర్ని ఉద్యోగంలోంచి తీసేస్తానన్నప్పుడు మీరేమీ మాట్లాడలేదేం.''

''రెండు గంటలు నిద్రలేకుండా నువ్వు ఆలోచించింది ఇదా?''

''ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పండి.''

''ఏమనాలి? వెంటనే తీసెయ్ అనాలా? ఇద్దరి తప్పూ ఉంది కదా నువ్వా పెర్సనల్ మేనేజర్ భార్యని కూడా మందలించు అనాలా?''

''ఏమనాలో నాకు తెలియదు. మీతో ఫోన్‌లో మొదటిసారి మాట్లాడినప్పుడు 'వాళ్ళిద్దరూ ఏం తప్పు చేస్తున్నారు? ఏమీ లేదే' – అన్నందుకు ఫోన్‌లోనే చెంప మీద కొట్టినట్టు మాట్లాడారు. మనిషికి మరో మనిషి పట్ల నమ్మకం ఎందుకుండాలన్న విషయం పిల్లలకి పాఠం చెప్పినట్టు చెప్పారు. కానీ ఈ రోజు అదే విషయం మీరు గట్టిగా సమాధానం చెప్పలేదు. భర్త తన కోర్కె తీర్చడం లేదు కాబట్టి ఆమె తన అవసరాలు వేరొకరితో తీర్చుకోవటంలో తప్పులేదని మీరు అనుకుంటున్నారా? ఒకప్పటి నా అభిప్రాయాలు మీకూ, మీ అభిప్రాయాలు నాకూ వచ్చేసాయా?'' అన్నది. ఆమెకు అంత సేపటి వరకూ ఎందుకు నిద్రపట్టలేదో అతడికి అర్థమైనట్టు అనిపించింది. ఆమెని దగ్గరగా తీసుకొని ''అనవసరంగా నువ్వు ఏదేదో ఆలోచిస్తున్నావు కళ్యాణీ. చాలా రాత్రయింది. నిద్రపో'' అన్నాడు. ఆ తరువాత పది నిముషాలకి ఆమె మళ్ళీ ''ఏమండీ'' అని పిలిచేసరికి అతడు అప్పటికే గాఢ నిద్రలో ఉన్నాడు.

3

''**చెప్పు**. నేను నీకు ఏ సాయం చేయగలను'' ఆస్పత్రి బెడ్ మీద వివేకానంద అడిగిన ప్రశ్నకు కార్తికేయ తెల్లబోయి, ''సాయం ఏమిటి?'' అన్నాడు.

''ఏదైనా పని కావాలంటే?''

''నాకేమీ అవసరంలేదు. కేవలం చూసిపోదామని వచ్చానంతే.''

“విమానంలో పక్కసీట్లో కూర్చుని ప్రయాణించినందుకు గాను పరామర్శించటానికి ఆస్పత్రికి వచ్చావంటే...” సగంలో ఆపాడు.

కార్తికేయ నవ్వి “మీకు మనుష్యుల మీద నమ్మకం చాలా తక్కువనుకుంటానే” అన్నాడు. ఆయన కూడా నవ్వి “రాజకీయ నాయకుడినిగదా” అన్నాడు. ఈ లోపు డాక్టర్ వచ్చాడు. రిపోర్టు చూపిస్తూ “బి.పి. తక్కువగా ఉంది. ఒకసారి మిగతా పరీక్షలు, స్కానింగ్ చేయిస్తే మంచిదని నా ఉద్దేశ్యం” అన్నాడు.

కార్తికేయ లేచి వెళ్తూ, తన చేతిలో పుస్తకం ఆయన కిచ్చాడు.

“ఎందుకిది?”

“మీ అమ్మాయి అనూజ్ఞకి మా దంపతుల గుర్తుగా.”

ఆయన పుస్తకం తీసి మొదటి పేజీ చూస్తూ, “మీ భార్య పేరు శ్రీకళ్యాణా?” అని అడిగాడు.

“అవును. కళ్యాణీ ఇండస్ట్రీస్. తెలిసే ఉంటుంది మీకు.”

“ఆ కళ్యాణీ ఇండస్ట్రీస్ అమ్మాయి నీ భార్యా? చాలా పెద్ద ఇండస్ట్రియలిస్ట్ కదూ...”

“అవును” అని అతను లేచి “వెళ్ళొస్తాను” అన్నాడు. కార్తికేయ వెళ్ళిపోయాక ఆయన పుస్తకం తెరిచి చూశాడు. “అభినందనలతో – కార్తికేయ, శ్రీకళ్యాణి” అని ఉంది అందులో. అది తీసుకుని ఆయన ఢిల్లీ బయల్దేరాడు. తనకి పెళ్ళయిందన్న విషయం అనూజ్ఞకి అన్యాపదేశంగా తెలపటం కోసం కార్తికేయ పంపిన ఋజువు అది.

★ ★ ★

ఢిల్లీ విమానాశ్రయం. అనూజ్ఞ దిగులుగా కూర్చుని ఉంది. ఇరవై నిముషాల తరువాత తండ్రి బయటకు వస్తూ కనిపించాడు. పరుగు పరుగున దగ్గరకు వెళ్ళింది. ఆయన కూతురి కంగారు చూసి ఆందోళనగా “ఏమైందమ్మా” అన్నాడు.

“నాక్కాదు నాన్నా. నీకు. వెళుతున్నప్పుడు విమానంలో ఏమైంది? అక్కడ హాస్పిటల్లో ఏమన్నారు?”

“విమానంలో ‘వెర్టిగో’ కాస్త కంగారు పెట్టిందమ్మా” అన్నాడాయన. కాస్త ఎత్తునుంచి చూస్తే అగాధంలోకి జారిపోతున్నట్టు భయంతో వళ్లు చెమట్లు పట్టి, రక్తప్రసరణం హెచ్చి కళ్లు తిరగటం, స్పృహ తప్పటం ‘వెర్టిగో’ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి తీవ్రంగా ఉన్నవాళ్లు మామూలుగా మెట్లెక్కుతూ కూడా క్రిందికి చూడలేరు.

కారు కదిలాక ఆమె “మామూలు వెర్టిగో అయితే ఆస్పత్రిలో చేరటం ఎందుకు?” అడిగింది.

“కంగారయిందనుకో. విమానంలో కార్తికేయ అని ఒకబ్బాయి నా పక్కసీట్లో ఉన్నాడు. మన తెలుగువాడే.” అనూజ్ఞ గుండె ఒక్క క్షణం ఆగి కొట్టుకోవటం మొదలుపెట్టింది.

“అన్నట్టు నీకు తెలుసుగా అతను. మీ సిమ్లా కూడా వచ్చాడట. పెయింటర్.”

ఆమె తలూపింది. ''సాధారణంగా పక్కింట్లో ఏం జరిగినా పట్టించుకోము. అటువంటిది పక్క సీట్లో నేను కాస్త కంగారు చేయగానే పాపం ఆస్పత్రి వరకూ వచ్చాడు. అలాటివాళ్ళు అరుదు.''

'అవును. చాలా అరుదు' మనసులో అనుకుంది. ముందు కారులో తండ్రీ కూతుళ్లు ఇద్దరే ఉన్నారు. వెనుక కార్లలో బాడీగార్డులూ, ఇతర వందిమాగధులూ ఉన్నారు. అయిదు నిముషాల తరువాత కారు ఇంటిముందు ఆగింది.

''అరగంటలో తయారవు నాన్నా. ఆస్పత్రికి వెళ్దాం'' అంది. ఆయన అర్థంకానట్టు చూసాడు. అన్నాడు. ''ఈ రోజు నీ ప్రోగ్రామ్‌లన్నీ కాన్సిల్. కేవలం ఆస్పత్రిలో పరీక్షలు మాత్రమే.''

''నా గురించి ఏమనుకుంటున్నావు? సెంట్రల్ మినిష్టర్‌ని. బోలెడు పనులుంటాయి.''

''ప్రొద్దున్నే జోకులెయ్యకు నాన్నా. మంత్రులకి పనులేమిటి? అసలు పార్లమెంటు లేకుండా ప్రెసిడెంట్ పాలన ఉన్నా దేశంలో ఏ తేడా ఉండదు.''

అరగంట తరువాత ఆస్పత్రికి బయల్దేరారు. నగరంలోకెల్లా ఖరీదైన ఆస్పత్రి. అనూజ్ఞ చేతిలో ఉన్న చిన్న ప్యాకెట్ విప్పింది. దానిలో కుంకుమ ఉంది. ''ప్రొద్దున్నే మహాలక్ష్మి గుడిలో అర్చన చేయించా. ఇది పెట్టుకో.''

''నేను వెళ్తున్నది యుద్ధానికి కాదు. సూపర్ స్పెషాలిటీస్‌లో పరీక్షలకి'' నవ్వుతూ అనబోయాడు. కానీ ఆ ప్రేమకి గొంతులో ఏదో అడ్డుపడి మాటరాలేదు. ఆప్యాయంగా కూతుర్ని దగ్గరకు తీసుకుని ''ఏమిటమ్మా ఇది'' అన్నాడు.

''నా పిచ్చి నాది నాన్నా.''

''నాకేమీ కాదు. మనవల్ని ఎత్తుకునేదాకా నేనేమీ చావను''. వాతావరణాన్ని తేలిక చేస్తూ అన్నాడు. అనూజ్ఞ అందంగా సిగ్గుపడింది. ఆయన కూతురి మొహంవైపు పరికించి చూస్తూ ''ఏమ్మా. ఏదో ప్రేమలో పడ్డట్టున్నావ్'' అడిగాడు.

అనూజ్ఞ తెల్లబోయింది. ''నీ కెందుకొచ్చింది ఈ అనుమానం?''

''మొహం చూడగానే ఓటరో కాదో చెప్పలేమా? అలాగే ఇది.'' ఆమె మాట్లాడలేదు. ''ఎవరతను చెప్పు.''

''బి.పి. పరీక్ష చేయించుకోవటానికి వెళుతూ ఇప్పుడెందుకులే నాన్నా. ముందు వెళ్ళిరా.''

''ఏమిటి? అతని పేరు చెప్పగానే నాకు బి.పి. పెరిగిపోయే మనిషా ఏమిటి?''

''కాదులే.''

''అయి ఉండదులే. నా కూతురి మీద నాకంత నమ్మకం ఉంది.''

''ఏమిటో అంత నమ్మకం'' ఓరగా చూస్తూ అంది. ''... ఈ ప్రపంచంలోకెల్లా ఏమీ చేతకాని వాడిని ప్రేమిస్తే?''

''వాడెవడు?''

''ఉదాహరణకి... రాజకీయాల్లో ఉన్నాడనుకో.''

''నీ తండ్రి వృత్తి మీద అంత చులకన భావం కూడదమ్మా.''

''ఉడుక్కోకు నాన్నా. నీ అపోజిషన్ పార్టీ నాయకుడి కొడుకనుకో.''

''పార్టీ మారిపోయి అయినా సరే చేస్తాను.''

''కోటిరూపాయలు కట్నం అడిగితే.''

''చాలా తక్కువ అది.''

ఆమె నవ్వు ఆపుకుని ''నిన్నంత ఇబ్బంది పెట్టనులే నాన్నా'' అంది. ఇంతలో వెనుకనుంచి పి.ఏ. వచ్చి ''సార్...రండి'' అన్నాడు. ఆయన అతనితో కలసి లోపలికి వెళ్ళాడు. కేంద్ర మంత్రి కాబట్టి ఏర్పాట్లన్నీ చకచకా సాగుతున్నాయి. ఆయన పి.ఏ. తన రెండో భార్యకి నాలుగోసారి ఆరో నెల్లో అబార్షన్ జరిగినంత కంగారుగా తిరుగుతున్నాడు.

ఆమె దృష్టిలో పడటం కోసం ఓ కుర్ర డాక్టరు ఏ పనీ లేకపోయినా, మొత్తం ఆస్పత్రంతా తన వల్లే నడుస్తున్నంత హడావుడిగా ఆమె ముందు నుంచి స్టెత్ పట్టుకుని తిరగడం గమనించింది. ఓ నాలుగు సార్లు అటూ ఇటూ తిరిగాక వచ్చి ఎదురుగా నిలబడి ''గుడ్మార్నింగ్ మాడమ్. నా పేరు డాక్టర్ పి.పి.టి. లాల్, ఎం.బి.బి.ఎస్., పి.హెచ్.ఎస్. ఆస్ట్రేలియా, డి.జి.బి.కెనడా, ఎఫ్.సి.ఎమ్.ఐ.'' అన్నాడు.

ఆమె విస్మయంతో చూసింది. తన డిగ్రీలు చెప్పగానే అలా ఆశ్చర్యంగా చూడటం మామూలే అన్నట్టు అతను నవ్వాడు. ఆమె ఆశ్చర్యంగా చూసింది అందుక్కాదు. అతడు చెప్పిన వాటిలో మొదటిదొక్కటే డిగ్రీ. మిగతావన్నీ పోస్టల్ డిప్లమాలు. అసలు పేరుతోపాటే డిగ్రీలన్నీ చెప్పుకునే అతడి మెదడు స్క్రూ సంగతి ఆమెకు అనుమానం వచ్చింది. అప్పుడే ఆమెలో అల్లరి పిల్ల నిద్ర లేచింది. అతడి వైపు అదోలా చూసింది.

''ఏమిటలా ఆశ్చర్యంగా చూస్తున్నారు?''

''ఇంత చిన్న వయసులో వైద్యశాస్త్రంలో ఇన్ని డిగ్రీలు సంపాదించిన మిమ్మల్ని వళ్ళంతా కళ్ళు చేసుకొని చూడక ఎవరైనా ఏమి చేయగలరు డాక్టర్ పి.పి.టి. లాల్'' ఇంగ్లీషులో అంది. లాల్ కాస్త ఉబ్బాడు. ''మిమ్మల్ని చూస్తూంటే నాకు నా స్నేహితురాలు గుర్తొస్తోంది డాక్టర్ లాల్'' నవ్వింది.

''ఎందుకు? ఆమెక్కూడా ఇన్ని డిగ్రీలున్నాయా?''

''కాదు. ఒక్కటే ఉంది. కానీ భర్తకు ఉత్తరం వ్రాసేటప్పుడు కూడా 'నీ చరణదాసి – శకుంతల బియ్యే' అని వ్రాసుకునేది.''

అందులో శ్లేషం అర్థం కాక మొహమాటంగా నవ్వాడు. ఆమె వాచీ చూసుకుంది. ఆమె సామీప్యాన్ని వదులుకోవటం ఇష్టం లేనట్టు, "మీ నాన్నగారు వచ్చేసరికి ఇంకా ఎలాగూ ఓ గంట పడుతుంది. రండి. మీకూ స్కానింగ్ టెస్టు చేస్తాను'' అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా 'నాకా' అంది. అవునన్నాడు. పోయిందేముంది అనిపించి ఆమె ఒప్పుకుంది. టెస్టు పూర్తయి బయటకు వస్తూంటే ''స్కానింగ్ అంటే సూదులూ అవీ గుచ్చుతారేమో అనుకున్నాను. ఇంత సులభం అనుకోలేదు'' అన్నది.

''చెప్పాను కదండీ. సైన్సు చాలా అభివృద్ధి చెందిందని.'' అన్నాడు. తండ్రి రావడానికి ఇంకో అరగంట పట్టొచ్చు. ''కాఫీ తాగుదాం రండి మాడమ్'' అన్నాడు. ఆమె వద్దని తిరస్కరించింది. వాళ్ళిద్దరూ తిరిగి వెళ్ళేసరికి డాక్టర్ భరద్వాజ ఏదో రిపోర్టులు చూస్తున్నారు. తలెత్తి కుర్ర డాక్టర్ వైపు చూసి ''ఈ ఫైలు మూసెయ్యండి. పేషెంట్ చనిపోయిందట'' అన్నాడు.

అనూజ్ఞ దృష్టి ఆ కాగితాల్లో ఉన్న పన్నెండేళ్ళ అమ్మాయి ఫోటో మీద పడింది. చొరవగా ఆ కాగితాలు తీసుకుని ''పాపం చాలా అందంగా ఉందికదూ డాక్టర్...'' అంది.

''ఆ పాప పేరు సుజాత'' అన్నాడు డాక్టర్ భరద్వాజ. ''హడ్జిన్స్ డిసీజ్ వచ్చింది.''

''హడ్జిన్స్ డిసీజా? పేరే భయంకరంగా ఉందే'' జాలిగా అంది అనూజ్ఞ.

లాల్ వెళ్ళలేక వెళ్లినట్టు అక్కడినుంచి బయటకు కదిలాడు. ''మామూలు మనుష్యులకీ, ఆ పేషెంట్లకీ అస్సలు తేడా తెలీదు. లింఫోబ్లాస్టిక్ అంటారు. మరణం చాలా సామీప్యంలోకి వచ్చేవరకూ దాన్ని పట్టుకోలేం. దానికిక మందు లేదు. కేవలం రక్త పరీక్షలోనే ఈ వ్యాధి పట్ల అనుమానం వస్తుంది'' అని ఇంకా ఏదో అంటూ ఉండగా, లాబ్ అసిస్టెంట్ వచ్చి అనూజ్ఞ తాలూకు రిపోర్టు తీసుకు ఇస్తూ, ''డాక్టర్. మీకు ఫోన్'' అని చెప్పింది.

భరద్వాజ అనూజ్ఞ రిపోర్టు బల్ల మీద పెట్టి లోపలికి వెళ్ళాడు. డాక్టర్ లాల్ ఇంకా రాలేదు. అనూజ్ఞ బల్ల మీదున్న తన రిపోర్టు చేతుల్లోకి తీసుకుంది. పక్కనే హడ్జిన్స్ డిసీజ్‌తో మరణించిన సుజాత రిపోర్టులున్నాయి.

అపుడొచ్చింది ఆమెకి ఆ అల్లరి ఆలోచన.

ఆ అమ్మాయి తాలూకు రిపోర్టు తన ఫైల్లో పెట్టి తన రిపోర్టు సుజాత రిపోర్టుల్లో కలిపేసింది.

4

**మధ్యాహ్నం** రెండయింది. దాదాపు గంట నుంచి శ్రీకళ్యాణి పడగ్గదిలో సమావేశం జరుగుతోంది. జనరల్ మానేజర్‌తో సహా మరో నలుగురు ఉన్నతాధికారులు ఉన్నారు. సాల్మన్ కంపెనీ తమ మీద పరోక్షంగా చేసిన దాడిని ఎలా తిప్పి కొట్టాలా అని వాళ్ళు ఆలోచిస్తున్నారు. వాళ్ళని దెబ్బకొట్టటమొక్కటే కాదు. తమ వ్యాపారం ఎలా సాగించాలా అన్నది కూడా సమస్యే.

''నిన్న సాయంత్రం నేను రత్నారెడ్డితో మాట్లాడాను. వాళ్ళు రేపట్నుంచి స్ట్రయిక్ మొదలు పెడుతున్నారు'' అంది శ్రీకళ్యాణి. ఆ మాటలకి అధికారులు ఒకర్నొకరు చూసుకున్నారు. కార్తికేయ నిశ్శబ్దంగా వింటున్నాడు.

రత్నారెడ్డి ప్రత్యర్థి సాల్మన్ కంపెనీ యూనియన్ లీడరు. అతని చేతి క్రింద ఉన్న కార్మిక సంఘం చాలా బలమైంది. అతనికి కళ్యాణి రెండు లక్షలు ఇచ్చింది. ఫ్లాష్ స్ట్రయిక్ (మెరుపు సమ్మె) చెయ్యటానికి. రత్నారెడ్డి దానికి ఒప్పుకున్నాడు.

మరి కొంచెంసేపు మాట్లాడి ఆమె క్రింది ఉద్యోగులు అందరూ వెళ్ళిపోయాక ''ఏమిటిది కళ్యాణీ?'' అని అడిగాడు కార్తికేయ.

''ఇదంతా బహుశా మీకు కంపరంగా ఉండి ఉంటుంది'' అంది నవ్వుతూ. ''...రాజీ ప్రసక్తి లేని యుద్ధంలో మనం చావటమో, ప్రత్యర్థిని చంపటమో రెండే మార్గాలు. అవతలివాడి కత్తికి మనం శాంతి జెండాని ఎదురు పెట్టలేం కదా. నేను నాశనం అవటం అంటూ జరిగితే వాళ్ళని సమూలనంగా నాశనం చేసి కానీ అవను.''

*'నేను' అన్నదామె. 'మనము' అనలేదు.*

ఈ సంభాషణవల్ల అతడు బాగా కలత చెందాడని అతడి ముఖ భంగిమే చెపుతోంది.

''పోనీ మీరే చెప్పండి. ఈ గొడవంతా లేకుండా మనం బావుండటానికి ఇంకో మార్గం ఏదైనా ఉంటే, ఈ క్షణం అవన్నీ మానేసి ఆ పద్ధతి అవలంబిస్తాను''.

''మనం బుద్ధుడిలా నిర్లిప్తత నాపాదించుకోనవసరం లేదు. క్రీస్తులా జనం కోసం శిలువ ఎక్కనవసరం లేదు. కానీ కొంత అహింస... కొంత శాంతి– ఇవన్నీ మన జీవన విధానాల్లో భాగం కాకపోతే ఇదెక్కడికి దారితీస్తుంది?''

''మీరు అసలు విషయం వదిలేసి ఎటో వెళ్తున్నారు''

''లేదు. పరిణామాలన్నిటికీ మానవ మనస్తత్వమే కారణమని చెపుతున్నాను. వాళ్ళు నీ మీద విషప్రయోగం చేస్తారు. వాళ్ళ కార్మికులతో నువ్వు సమ్మె చేయిస్తావు. వాళ్ళు నీ బ్యాంకుల అప్పుల్ని నిరోధిస్తారు. నువ్వు వాళ్ళమీద ఇన్‌కంటాక్స్ దాడులు నిర్వహింపజేస్తావు. వాళ్ళు నీ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదాలు సృష్టిస్తారు. దానికి మళ్ళీ నువ్వేదో... మళ్ళీ వాళ్ళేదో... ఇక ఇది ఆగదు'' అని ఒక క్షణం ఆగి నెమ్మదిగా, దీనికి స్వస్తి పలుకు కల్యాణీ'' అన్నాడు.

''స్వస్తి పలికి ఏం చేద్దాం? 'మేం ఓడిపోయాం' అంటూ వాళ్ళ దగ్గరకి రాయబారం వెళ్దామా?''

''మీ జోలికి మేము రాము. మా జోలికి మీరు రావద్దు... అని చెప్తే వినరా వాళ్ళు''.

''వినరు. డిన్నర్‌లో మళ్ళీ నవ్వుకుంటారు.''

''ఒక ఛాన్సు తీసుకోవటంలో తప్పులేదని నా అభిప్రాయం.''

''ఎవరు వెళ్తారు. రాయబారానికి మీరు వెళతారా?''

''వెళతాను.''

''నాకు దక్షయజ్ఞం కథ గుర్తొస్తోంది. మీకు అపహాస్యం తప్ప మరేమీ దొరకదు అక్కడ.''

''వేలమంది కార్మికులు వీధిన పడకుండా ఉండటం కోసం, ఒక అపహాస్యాన్ని భరించలేనా నేను?''

''అయితే ఇప్పుడు నేను చేస్తున్నదంతా తప్పంటారా?''

‘‘నువ్వు చేస్తున్నది తప్పా? ప్రత్యర్థి కంపెనీ చేస్తున్నది తప్పా? అనటంలేదు. దెబ్బలాడుకుంటుంటే మధ్యలో నలిగిపోయే అమాయకుల విషయం మాట్లాడుతున్నాను.’’

‘‘మాట్లాడటం నేనూ చేయగలను. వాస్తవంగా ఏం చెయ్యగలమన్నదే సమస్య’’ అంది.

అతను హర్ట్ అయ్యాడు. అయినా దాన్ని కప్పిపుచ్చుకుని ‘‘మతం కోసం బిన్ లాడెన్ నాలుగు వేలమంది అమాయకులని చంపాడు. వారికీ మీకూ తేడా ఏమైనా ఉందా?’’ అన్నాడు.

ఆమె మొహంలోకి రక్తం జివ్వున చిమ్మింది. పెదాలు కంపించసాగాయి. ఆవేశంతో స్వరం వణుకుతుండగా ‘‘అవును మేం రాక్షసులం. మేము మనుషుల్ని చంపుకు తింటాం! కానీ మీకు తెలుసా? ఈ ప్రపంచపు ఆర్థిక భారాన్నంతా మా భుజాల మీద మోసే అట్లాస్‌లాంటి వాళ్ళము మేము. ఉత్పత్తులు ఎలా ఎక్కువ చేయాలా అని రాత్రిళ్ళు నిద్ర మానుకుని ఆలోచిస్తాం. విధానాలను రూపొందించడం కోసం పగలంతా నిర్విరామంగా కృషి చేస్తాం. మా శ్రమలో సగ భాగం ప్రభుత్వానికి ఇస్తాం. మేము కట్టే పన్నులతో పోలీసు వ్యవస్థ నడుస్తుంది. మేము ఇచ్చే పన్నులతో సైన్యం కాపలా కాస్తుంది. ఆ రక్షణలో మీలాటి కవులూ, కళాకారులు తీరిగ్గా విశ్రమిస్తారు. పనీ పాటా లేకుండా మమ్మల్ని విమర్శిస్తారు’’ అంది.

సూదిగా చెక్కిన బాణం నేరుగా వచ్చి గుచ్చుకుంది. గుండె పొరల్ని చీల్చుకెళ్ళి, అతి సున్నితమైన మనసు భాగాన్ని తునాతునకలు చేసింది.

అతని మనసుని కాదు. ఆమెని..! తనెంత తప్పుగా మాట్లాడిందో, మాట అనేసిన తరువాత అర్థమయింది. ఒకవైపు ఆర్థికపరమైన ఒత్తిడి, మరొక వైపు శారీరక ఇబ్బంది, ఇంకో వైపు పరిస్థితి చేయిజారిపోతున్న నిస్పృహ... అన్ని వైపుల్నుంచీ చుట్టుముట్టడంతో ఆమె ఒక క్షణం సమతుల్యం తప్పింది. ఏ పనీ చేయకుండా ఇతరుల స్వేద బిందువుల గురించి చర్చించే వారి మీద ఆమెకున్న అంతర్గత కోపం ఆ విధంగా బయటపడింది. దానికి గురి అయింది అతడు..! చాలా దారుణమైన దెబ్బ అది..!

అయితే అతడు మాత్రం వెంటనే తేరుకున్నాడు. వాస్తవానికి ఆమె అంత సూటిగా మాట అనేసరికి అతడు కూడా బిత్తరపోయాడు. కానీ, వెంటనే ఆమె బాధపడటం కూడా గమనించాడు.

నోరుజారి అవతలివాళ్ళు ఒక మాటంటే, దాన్ని పట్టుకుని వాదనలో గెలవటం, ఆపై అవతలివారిని ఓడించి క్షమాపణ చెప్పించుకోవటం మేధావుల లక్షణమై యుండవచ్చు. కానీ అవతలివాళ్ళు మాట జారితే దాన్ని గుర్తించలేదన్నట్లు ప్రవర్తించటం మహోన్నతుల స్వభావం.

నవ్వుతూ ‘‘ఏమిటి ఈ రోజు చాలా వేడిమీద ఉన్నావ్?’’ అన్నాడు. కానీ లాభం లేకపోయింది. తన మాట అతని గుండెల్లో నుంచి దూసుకు పోయిందని ఆమె గ్రహించింది. ఆ తరువాత ఇద్దరూ పూర్వసంభాషణ మర్చిపోయినట్టు నటిస్తూ చాలాసేపు మాట్లాడుకున్నారు కానీ ఎక్కడో వెలితి కనపడుతూనే ఉంది.

ఇద్దరు నిష్ణాతుల మధ్య ప్రేమ సాధ్యం కాదని ఆమెకి అనిపించింది. ప్రేమించుకోవాలంటే ఇద్దరిలో ఒకరు అమాయకులైనా అయివుండాలి. లేదా ఉనికిని కూడా మర్చిపోయేటంత గాఢమైన ప్రేమలోనన్నా ఉండాలి. గమనింపు ఉండకూడదు.

''నేను వ్యాపారాన్ని ఎక్కువ ప్రేమిస్తున్నానా? కార్తికేయనా?' అన్న ఆలోచన ఆమెకి మొదటిసారి కలిగింది. ఎన్నో ఆలోచన్లు. కార్తికేయకు తన మీద ఉన్నది ప్రేమా? జాలా? డబ్బు మీద అతడికి ఆశలేదు. తను సంసారిక సుఖానికి కూడా పనికిరాదు. మరి తనని ఎందుకు ప్రేమిస్తున్నాడు? కేవలం నైతిక ధర్మమా? కేవలం భార్య కాబట్టే ప్రేమిస్తున్నాడా? అంటే... తన స్థానంలో ఇంకెవరున్నా ఇలాగే ప్రేమించేవాడన్నమాట. అవును మరి. తనలో చాలా గొప్ప గుణాలుండవచ్చు. కానీ అతనికి నచ్చే గుణం తనలో ఒక్కటీ లేదు. ఎంత దయనీయమైన పరిస్థితి. అతడి దృష్టిలో తనో గొప్ప వ్యక్తి. అంతే. కానీ ప్రేమంటే ఒకరి గొప్పతనం ఒకరు గమనించుకోవటం కాదు. కొట్టుకోవాలి. తిట్టుకోవాలి. ఆపై కలిసిపోవాలి. అవేమీ తమ మధ్య లేవు. మొట్టమొదటిసారి ఈ విషయం గుర్తించేసరికి ఆమె వళ్ళు జలదరించింది.

ఆ రాత్రి ఆమె కంపోజ్ టాబ్లెట్లు ఎక్కువ వాడింది. సమస్యల్లో ఉన్నవాళ్ళు, మగవాళ్ళయితే స్కాచ్‌నీ, ఆడవాళ్ళయితే కంపోజ్‌నీ వాడటం సాధారణమే. ఆ రాత్రి ఆమె మోతాదు మించి వేసుకోవటంతో అసలే నరాలు బలహీనంగా ఉండటం వల్ల, అర్ధరాత్రి 'కన్‌వల్షన్స్' మొదలయ్యాయి. రాత్రికి రాత్రి ఆస్పత్రిలో చేర్పించవలసి వచ్చింది. రెండ్రోజుల పాటు ఆస్పత్రిలో ఉండి ఇంటికి వచ్చింది.

సమ్మె వల్ల సాల్మన్ కంపెనీకి అనుకున్నంత సమస్యలు రాలేదు కానీ, ఆమె చావు బ్రతుకుల మధ్య ఉన్నదన్న 'రూమర్' పాకి, అప్పు ఇచ్చే బ్యాంకర్లు మరింత బిగుసుకు పోయారు. సంస్థల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. షేరు ధర మరింత పడిపోయింది.

అయితే కళ్యాణి అదేమీ పట్టించుకోలేదు. భర్తనే చూస్తోంది..! ఆ రెండురోజులూ అతను ఆమె పక్కనుంచి కదల్లేదు. అనుక్షణం ఆమెనే కనిపెట్టుకొని ఉన్నాడు. చివరికి ఆమె వామ్టింగ్స్‌ని కూడా అతడే దగ్గరుండి శుభ్రం చేయించాడు.

శ్రీకళ్యాణి ఇదంతా గమనిస్తూనే ఉంది. ఈ 'గమనింపు' అనేది గాఢమైన ప్రేమలో ఉండగా రాదు. ప్రేమికులకి అవతలి వారి బలహీనతలు, వ్యసనాలు, బద్ధకం, కోపం, భయం పట్ల మొదట్లో గమనింపే ఉండదు. ప్రేమావేశం తగ్గాక చిరాకు ప్రారంభమవుతుంది. అవతలి వ్యక్తిలో మనకి నచ్చే కొన్ని లక్షణాలన్నా లేకపోతే, మనం వారిని ప్రేమించటం గానీ, వారితో ప్రేమించబడటం గానీ జరగదు. అందుకే ఒకరి గురించి ఒకరు తెలుసుకోకుండా జరిగే వానాకాలం ప్రేమలు ఎక్కువకాలం నిలబడవు.

'తమదీ అటువంటి ప్రేమేనా?' అన్నది కళ్యాణికి కలిగిన కొత్త అనుమానం. 'మీరు నాలో ఏం చూసి ప్రేమిస్తున్నారు?' అని అడగాలని నోటి చివరి వరకూ వచ్చి ఆగిపోయేది. అతడి నవ్వే సమాధానం అవుతుందని తెలుసు. కానీ

వాస్తవం వాస్తవమే కదా..! అతని చేతిలో ఉన్న అపూర్వమైన కళ పట్ల తనకి ఏ విధమయిన ఆరాధన భావమూ లేదు. పైకి చెప్పకపోయినా తన వ్యాపారం పట్ల అతనికి ఏ ఇష్టమూ లేదు. అయినా తామిద్దరినీ కట్టిపడవేస్తున్నది ఏమిటి? కేవలం మంగళసూత్రమా?

ఆమె వణికిపోయింది. మానవ సంబంధాలన్నీ స్వార్ధపూరితమైనవే అన్న ఆమె ప్రగాఢ అభిప్రాయానికి ప్రశ్నలా తయారయ్యాడు కార్తికేయ. మొదట్లో అతని అపూర్వ అభిమానంలో ఆమె కరిగిపోయిన మాట వాస్తవమే కానీ, ఇప్పుడు తేరుకుని చూస్తే అంతా తను 'తీసుకోవటమే' కనిపిస్తోంది కానీ ఇవ్వటం కనిపించలేదు.

ఇక ఆగలేక ఒక రోజు, ''నేను మీకేం చెయ్యగలను?'' అని అడిగింది.

అతను తెల్లబోయి, ''నువ్వు నాకు చెయ్యటమేమిటి?'' అన్నాడు.

''నేనేం చెయ్యలేను. అదే చెబుతున్నాను'' అంది.

''నువ్వు ఖాళీగా ఉండి ఎక్కువ ఆలోచిస్తున్నావ్ కళ్యాణీ'' లాలిస్తున్నట్టు అన్నాడు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments